క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఐదుగురు లబ్ధిదారులకు రూ.11 లక్షల విలువైన చెక్కులు అందించినట్టు ఆయన తెలియజేశారు. వైద్య అవసరాలు నిమిత్తం సీఎం జగన్ ఈ నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాపు వన భోజనాలు వాయిదా

కాకినాడ రూరల్: కాకినాడ శుభం కాపు కల్యాణ మండపంలో ఈనెల 10న నిర్వహించ తలపెట్టిన కాపు వన భోజనాలు తుఫాన్ కారణంగా వాయిదా వేసినట్టు కాపు సద్భావన సంఘ నేతలు ప్రకటించారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన సమావేశంలో సంఘ నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, బసవా ప్రభాకర రావు ప్రకటించారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని వారు వెల్లడించారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

కరప: ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలసి గురువారం కరపలో పర్యటించి ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన నక్కా లక్ష్మయ్య, మేడిశెట్టి అప్పారావు బాబ్జీ కుటుంబాలను ఆయన పరామర్శించి సంతాపం తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు



యండమూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కరప: మిచాంగ్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. యండమూరులో గురువారం ఆయన పార్టీ నాయకులతో కలసి ముంపుకు గురైన వరిపనలను, తడిసి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. తుపాను హెచ్చరికలతో అప్రమత్తమై ముందుగానే ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేసి ఉంటే ఈ నష్టం వాటిల్లేదికాదన్నారు. రైతులు, కౌలు రైతులనే వ్యత్యాసం చూపకుండా దెబ్బతిన్న పంటను లెక్కించి పరిహారం వచ్చేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తర్వాత ఆర్‌బీకేకు వెళ్లి వీపీఏతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాగా ధాన్యం రాశులను బూటకాళ్లతో, చెప్పులు ధరించి తొక్కడాన్ని రైతులు తప్పుపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామ్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పితాని లీలావతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

బాలాజీచెరువు: నగరంలోని నూకాలమ్మ తల్లి ఆలయ హుండీలను గురువారం కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. హుండీ ఆదాయం 7 నెలలకు రూ.4,43,302 రాగా ఆలయ ఈఓ కె.లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

దైన్యం లేకుండా.. ధైర్యాన్నిస్తూ..

- తుపాను నష్టంపై సత్వర అంచనాలు
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- మరింత వేగంగా పరిహారం, బీమా



తమ్మవరంలో నీట మునిగి కుళ్లిన వరి దుబ్బులను వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ, పరిశీలకురాలు సత్యవతికి చూపుతున్న రైతులు

కాకినాడ రూరల్: ఇది ఒక్క వెంకటరమణ సమస్య మాత్రమే కాదు. వేలాది అన్నదాతల సమస్య. నియోజకవర్గ పరిధిలో రూరల్, కరప మండలాల్లో సుమారు 18,500 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. తుపాన్ సమయానికి చాలా వరకు కోతలు పూర్తికాగా, కోతలకు సిద్ధంగా ఉన్న, పనలపై చేలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల ధాన్యపు రాసులు తడిసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలుకు ఎటువంటి అభ్యంతరాలు చెప్పడం లేదు. తుపాన్ తీరం దాటడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలానికి ఒక ప్రత్యేకాధికారి, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు బృందంగా పంట నష్టం అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటికి 2700 ఎకరాలలో వరిచేలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. రూరల్ మండలంలో సుమారు 1200 ఎకరాలలో వరిచేలు దెబ్బతిని రైతులు నష్టపోయినట్టు అంచనా వేశారు. ఎక్కువగా కొవ్వూరు, తూరంగి, తమ్మవరం గ్రామాల్లో పంట నష్టం వాటిల్లింది. వరిచేలు నీటిలో ఉండిపోవడం ధాన్యం మొలకలు వస్తున్నట్టు వ్యవసాయాధికారి సత్యనారాయణ, పరిశీలకురాలు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, తహసీల్దార్ మురార్జీ గుర్తించారు. కరప మండలంలో సుమారు 1500 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు.

ఈ చిత్రంలో కుళ్లిన వరి దుబ్బును చూపుతున్న కౌలు రైతు పేరు దెయ్యాల వెంకటరమణ. తమ్మవరం గ్రామం. రెండెకరాల పొలం తీసుకుని తొలకరిలో ఖరీఫ్ సాగు చేశాడు. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.50వేల పైబడి పెట్టుబడి పెట్టాడు. మరో పది రోజుల్లో కోతకు వస్తుందనగా అతని ఆవలను మిచాంగ్ మింగేసింది. మండల వ్యవసాయ శాఖ అధికారి, పరిశీలకుడు పంట పొలం వద్ద పరిశీలించి పరిహారం కోసం, బీమా కోసం ప్రభుత్వానికి నివేదించారు. సకాలంలో స్పందించిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. →

క్షేత్ర స్థాయిలో నష్టం అంచనా

"తుపానుకు దెబ్బతిన్న వరిచేలను క్షేత్ర స్థాయిలో గుర్తించి బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి అంచనాలను నివేదిస్తున్నాం. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో తడిసిన ధాన్యం కొనుగోలులో అభ్యంతరాలు లేకుండా చూస్తున్నాం. పంట నష్ట పరిహారం, బీమా అందేలా చర్యలు తీసుకుంటున్నాం."

– పద్మశ్రీ, ఏడీఏ, కాకినాడ రూరల్



తమ్మవరంలో నీట మునిగి కుళ్లిపోయే దశలో ఉన్న వరి పనను చూపుతున్న కౌలు రైతు దెయ్యాల వెంకటరమణ



వాకాడ లే అవుట్‌లో ధాన్యం రాశులను విడదీసి, ఆరబెట్టుకుంటున్న అన్నదాతలు

పంట నష్టం పరిశీలన

కరప: మండల పరిధిలో తుపాను వల్ల నష్టపోయిన యండమూరు, గురజనాపల్లి, పాతర్లగడ్డ, వలసపాకల, కరప తదితర గ్రామాల్లోని పంటలను అధికారులు గురువారం పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పి.మాచర్రావు సిబ్బందితో కల్సి వలసపాకల, వేములవాడ, పెద్దాపురప్పాడు గ్రామాల్లో వారు పర్యటించి తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. యండమూరులో తడసిన వరిపనలను పరిశీలించి వెళ్లారు.



యండమూరులో తడిసిన పనలను పరిశీలిస్తున్న అధికారులు



మళ్లలో తడిసిపోయిన గడ్డిని గట్టుకు తీసుకువస్తున్న రైతులు

అభివృద్ధికి ఆదర్శం ఏపీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 34వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్

కాకినాడ: రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 34వ డివిజన్ బ్యాంక్‌పేటలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ప్రదర్శన ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ఏపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. రాజకీయ లబ్ధి కోసం టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలను దగా చేసేందుకు మరోసారి ముందుకు వస్తున్నాయని, ఇటువంటి పార్టీలను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ తెహెరాఖాతూన్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, పలువురు మాజీ కార్పొరేటర్లు సమావేశంలో పాల్గొన్నారు.



రమణయ్యపేట సచివాలయం వద్ద మాట్లాడుతున్న గీసాల శ్రీనివాసరావు

సీఎంగా జగనే మళ్లీ రావాలి

కాకినాడ రూరల్: అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని జేసీఎస్ మండల కన్వీనరు గీసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేట సచివాలయం- 4 పరిధిలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఆయన మాట్లాడారు. తొలుత గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన సచివాయల పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం పథకాల ద్వారా రూ.33 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఈఈ పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంజా సత్తిబాబు, జాన్ ప్రభాకర్, నాని తదితరులు పాల్గొన్నారు.

24వ రోజుకు మహాశక్తి యాగం



యాగ వేదికపై లలితా అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

- భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు
- శ్రీపీఠాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠం ఆధ్వర్యంలో సాగుతున్న మహాశక్తి యాగం నిరుపమానంగా సాగుతోంది. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, లలితా సహస్ర నామార్చనలు చేస్తున్నారు. గురువారం శ్రీపీఠాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సందర్శించి బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణనంద స్వామి ఎమ్మెల్యేకు మహాశక్తి యాగం గురించి వివరించారు. ఎమ్మెల్యే వెంట ఆయన తండ్రి కురసాల సత్యనారాయణ, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.



లలితా కుంకుమార్చనలలో పాల్గొన్న భక్తులు

15 నుంచి జగనన్న సంక్రాంతి సంబరాలు

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



జగనన్న సంక్రాంతి సంబరాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి జనవరి 8వ తేదీ వరకు జగనన్న సంక్రాంతి సంబరాలు పేరిట మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రచార పోస్టర్‌ను గురువారం 34వ డివిజన్ బ్యాంక్‌పేటలో ఆయన ఆవిష్కరించారు. సిటీలోని నాలుగు క్లస్టర్ల పరిధిలో నాలుగు డివిజన్లలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కాకినాడలోని 43 డివిజన్లలో ఈ సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళల కోసం మ్యూజికల్ చైర్స్, చుక్కల ముగ్గులు, టగ్ ఆఫ్ వార్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి డివిజన్ పరిధిలో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. డివిజన్‌స్థాయిలో ఎంపికైన వారికి జనవరి 8న నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 75697 28234, 63020 04338, 63045 42256, 63045 26995 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్లు తెహెరాఖాతూన్, రోకళ్ల సత్యనారాయణ, వరిపల్లి కృష్ణవేణి, కర్రి శైలజ, అజ్జు పాల్గొన్నారు.

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం



ఉద్యానవనంలో మాజీ సైనిక ఉద్యోగులు రామారావు, శ్రీరామ్, వాకర్స్ నాయకుడు రత్నప్రసాద్

కాకినాడ రూరల్: రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి రామారావు మాట్లాడుతూ దేశ రక్షణకు సాయుధ దళాలు అహరిన్శలు కృషి చేస్తున్నాయన్నారు. వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు ఏటా డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. మరో మాజీ సైనిక ఉద్యోగి శ్రీరామ్, వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటిలోగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేయండి

ఈఆర్ఓ నాగ నరసింహారావు



సమీక్షిస్తున్న ఈఆర్వో, కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో వచ్చిన ప్రతి దరఖాస్తును శనివారంలోగా ఆన్‌లైన్ చేయాలని నియోజకవర్గ ఈఆర్ఓ, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం ఏఈఆర్వోలు, బీఎల్ఓలతో ఆయన సమావేశమయ్యారు. ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించుకున్నాక ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కొత్త ఓట్ల కోసం వచ్చిన దరఖాస్తులు, నాన్ ట్రేస్డ్‌తో పాటు వివిధ దశల్లో ఉన్న ఇతర దరఖాస్తులు వేగంగా పరిష్కరించడంలో బిఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఏఈఆర్వోలను, ఇతర ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను సంప్రదించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్వోలు సీతాపతిరావు, మురళీకృష్ణ, నాగశాస్త్రులు, జాన్‌బాబు, జి.వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం బవురువాక గిరిజన తండాలో సారా బట్టీలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, మోసరి సత్తిబాబుపై కేసు నమోదు చేశారు. ఒమ్మంగిలో ఐదు లీటర్ల సారాతో మొగిలి ధర్మరాజును, కిర్లంపూడి మండలం తామరాడలో పది లీటర్ల సారాతో గుత్తుర్తి వీర వెంకట సత్యనారాయణను, గోనేడలో పది లీటర్ల సారాతో తాతపూడి నాగేశ్వరరావులను అరెస్టు చేశామని వివరించారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ప్రత్తిపాడు, కిర్లంపూడి తహసీల్దార్ల వద్ద హాజరుపరిచారు. ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద నీరు ఫుల్.. రాకపోకలు నిల్



నమూనా ఆలయం చుట్టూ చేరిన నీరు



అన్నవరం జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు

- వరద నీటితో హైవేపై రాకపోకలకు అంతరాయం
- పంపాకు వరద ఉధృతి తగ్గడంతో అనుమతి
- ప్రస్తుతం స్థిరంగా పంపా నీటిమట్టం

అన్నవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురియడంతో పంపా నదికి వరదనీరు పోటెత్తింది. అదనపు జలాలను బ్యారేజీ గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేయడంతో ఆ నీరు స్థానిక డిగ్రీ కళాశాల వద్ద జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలను అన్నవరం మెయిన్‌రోడ్ మీదుగా మళ్లించారు. గురువారం మధ్యాహ్నం వరకు జాతీయ రహదారిపై వాహనాలను అనుమతించ లేదు. పంపాకు నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మళ్లీ వాహనాలను అనుమతించారు. నీటి ఉధృతి తగ్గడంతో పంపా రిజర్వాయర్ గేట్లు దించి 400 క్యూసెక్కుల నీటిని మాత్రమే సముద్రంలోకి విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి పంపా నీటిమట్టం 102.8 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లోస్ 400 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లోస్ 400 క్యూసెక్కులు ఉంది.

సత్యదేవుని నమూనా ఆలయం చుట్టూ చేరిన వరద

జాతీయ రహదారిపై ప్రవహించిన వరద నీరు అక్కడకు సమీపంలో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం చుట్టూ చేరింది. జాతీయ రహదారికి రెండు అడుగుల ఎత్తున నిర్మిస్తున్న ఈ నమూనా ఆలయం ముందు భాగంలో ఇంకా మెరక చేయలేదు. మెరక చేస్తే వరద నీరు వచ్చే అవకాశం లేదని దేవస్థానం అధికారులు తెలిపారు. నమూనా ఆలయం నిర్మాణానికి మెటీరియల్స్ తెచ్చుకునేందుకు వీలుగా దీనిని మెరక చేయలేదన్నారు. త్వరలో మెరక చేస్తామని వివరించారు. కాగా అన్నవరం ఎంట్రాన్స్‌లో బెండపూడి వైపు వై జంక్షన్ వద్ద నీరు రోడ్డుపై ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బెండపూడిలోని కాగితాలమ్మ చెరువు నుంచి నీరు అన్నవరంలోని రిజర్వ్ చెరువుకు వెళ్లే కాలువను మూసివేయడంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సత్యదేవుని నమూనా ఆలయం వెనుక గల దేవస్థానం స్థలంలో నాటిన మారేడు మొక్కలు నీట మునిగాయి. వీటి సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

జగ్గంపేట: తుపాన్లు, భారీ వర్షాలు వస్తే స్థానిక పేకేటి వీరమ్మ చెరువు కాలువ పొంగి పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తెలిపారు. పేకేటి వీరమ్మ చెరువు కాలువను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి పలు ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా పంచాయతీ అధికారి కాలువను పరిశీలించారన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో కలిసి వెళ్లి ముంపు నివారణ చర్యలకు ప్రాథమిక అంచనాలు రూపొందించామని తెలిపారు. ఈ నివేదికను జెడ్పీటీసీ సభ్యురాలు బింధుమాధవి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందచేసి నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ రాంజీ, ఈఓపీఆర్డీ కొండలరావు, ఈఓ గణేష్‌బాబు పాల్గొన్నారు.

హరిహర మహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు

యానాం: గౌతమీ గోదావరి తీరంలో పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని ఈ నెల 10న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హరిహరమహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఫెర్రీ రోడ్డులో వేలాది మంది భక్తుల కోసం సుమారు 10 ఎకరాల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలనే మహాసంకల్పంతో ఈ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహాయజ్ఞానికి యానాం నుంచే కాకుండా ఆంధ్రా ప్రాంతం నుంచి సైతం ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అందరికీ ఆహ్వాన పత్రాలు పంపామన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచే గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరుణ, దీక్షా ధారణ పూజలు ఉంటాయయ్యారు. 11 గంటల నుంచి మహాఅన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నేపాల్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన రుద్రాక్షలతో అర్చన చేసి వాటిని భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. శాంతికల్యాణం, జ్యోతిర్లింగార్చన, గోదావరి హారతి అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.